కథానిక:

# ★ తల్లిలేని లోటు ★

ప్రక్కింట్లో పెళ్ళి జరుగుతోంది.

బ్యాండు, సన్నాయి వాయిద్యాలతో పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. పందిట్లో ప్రతివ్యక్తీ యెంతో వుత్సాహంతో వున్నాడు. నీరజ మాత్రం తమ యింటి ద్వారందగ్గర నిర్జీవప్రతిమలా నుంచుని, ఆ సందడిని పరికిస్తోంది. అంతేగాని, ఆమెకు వుత్సాహంలేదు. అందరితోనూ ఆ వుత్సాహాన్ని పంచుకోలేకపోయింది, అలా యెంతోసేపు నిల్చోలేక లోనికిపోయింది.

అప్పుడే చీకటి పడింది. నీరజ దీపాలు వెలిగించి, మంచంమీద ఒరిగింది. ఆమెకు దుఃఖం వెల్లువలై పొంగి ప్రవహించింది. శారదకి పెళ్ళవుతుంది... ఆమె తనకంటె కనీసం నాలుగేళ్ళయినా చిన్నది వయస్సులో. తన వయస్సువాళ్ళంతా, పెళ్ళయి సంసారాలు చేసుకొంటూ, పిల్లల్ని కంటూ, తన యిల్లూ తన సంసారమూ అన్న బాధ్యతను పెనవేసుకుని ఆనందంగా వుంటున్నారు. కాని తను మాత్రం యింకా అవివాహితురాలే. వయసుని మాత్రం పెంచుకొంటోంది...

నీరజ, యీ ఆలోచనల్లో వుండగానే బైట యెవరో తలుపు తట్టారు. నీరజ వెళ్ళి తలుపు తీసింది, తండ్రి సుబ్బారాయుడు లోపలికి వచ్చాడు.

'అన్నయ్య యింకా రాలేదేమిటమ్మా?' అంటూనే గదిలోపలికి వచ్చాడు. "లేదు నాన్నా," ముక్తసరిగా జవాబిచ్చింది నీరజ.

"వీడొకడూ! వుద్యోగం సద్యోగం లేకపోయినా, యేదో రాచకార్యాలు వున్నట్టు రాత్రి యెనిమిది దాటితేనేగాని, యిల్లు చేరడు" విసుక్కుంటూ దుస్తులు వొల్చి, వాలుకుర్చీలో కూలబడి, చుట్ట వెలిగించాడు.

ప్రక్కింటి వాయిద్యాలూ, ఆ సందడి, అతనికో ఓ విధమైన సంచలనం రేపెట్టాయి. శారదకి పెళ్ళవుతుంది... మొన్న మొన్నటి అమ్మాయి ... నీరజ ఆమెకంటె వయిసులో పెద్ద...అయినా. అవివాహితగా యింట్లోనే వుంది... దీనికి యెవరు బాధ్యులు? తనేమరి! అవుతే, తను నీరజకి పెళ్ళి చేసేస్తే, ఆమె మట్టుకి ఆమె అత్తారింటికి వెళ్ళిపోతే, ఇంక తనకి గంజి పోసే దిక్కెవుండదు. వాడిమట్టుకి వాడు పెళ్ళాన్ని చెంగున గట్టుకు పోయాక... రెండోవాడున్నాడూ అంటే వుద్యోగం లేకుండా తిని తిరుగుతున్నాడు. పోనీ, వాడికైనా పెళ్ళి చేద్దామా అంటే, వుద్యోగం లేనిదే యెవరు పిల్లనిస్తారు?

సుబ్బారాయుడు యీ విధంగా ఆలోచిస్తున్నంతలో రఘు వచ్చాడు.

"ఏంరా! ఇంతవరకూ వూళ్ళో తిరుగుతూ వుంటే, యెలా! నీరజ ఒంటరిగా వుంటుంది కదా, దానికి భయం వెయ్యదూ?" అన్నాడు కొడుకుని వుద్దేశించి సుబ్బారాయుడు.

రచన:
ఎమ్. హనుమంతరావు

"మీరు యింటికి వచ్చేసి వుంటారనుకున్నా! ఎంతని నేను మాత్రం యింట్లో కూచుంటాను చెప్పండి? మీరు ఆఫీసు నుండి నేరుగా యింటికి వచ్చేస్తే కాదూ" ఎదురు ప్రశ్న వేశాడు రఘు.

సుబ్బారాయుడికి చిన్నకొడుకు సంగతి మొదట్నుంచీ తెలుసును. వాడో కొరకరాని కొయ్యగా తయారయ్యాడని అప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాడు. అందుకే, రఘుతో యెక్కువ వాదన పెట్టుకోడు గదమాయించడం ప్రశ్నే లేదు మరి!

"చూడరా రఘూ! ప్రక్కింటి వాళ్ళమ్మాయి పెళ్ళి యెంత వైభవంగా జరుగుతోందో! మన నీరజకంటె ఆ అమ్మాయి చిన్నది కూడాను..." అర్థయుక్తంగా తన అభిప్రాయాన్ని వెల్లడి చేశాడు సుబ్బారాయుడు. "వాళ్ళనాన్న శ్రద్ధతీసుకుని సంబంధం చూశాడు... పెళ్ళి చేస్తున్నాడు" కుండబద్దలు కొట్టినట్టుగా ఖచ్చితంగా అన్నాడు రఘు.

సుబ్బారాయుడు గతుక్కుమన్నాడు. కొడుకు తప్పంతా తనమీదే రుద్దాడని అర్థంచేసుకున్నాడు. అంతేకాదు— కొడుకుతో యీవిషయం ప్రస్తావించడం తనదే తప్పన్న విషయం చాలా ఆలస్యంగా గుర్తించాడు కూడాను.

"నేనూ చూస్తున్నానురా! కాని, తగిన సంబంధం దొరకడంలేదు. నువ్వు కూడా కాస్త ఆ దృష్టిలో వుండకూడదూ? మీ అన్నయ్యంటే సరేసరి! వాడు పెళ్ళాన్ని వదిలి ఒక్కక్షణం వుండలేడు. ఆ వూరు వదిలి రావడమంటేనే వాడికికష్టం..." "బావుంది.. నన్ను పెళ్ళిళ్ళ పేరయ్య కమ్మంటారన్నమాట! పెద్దవారు మీరుండగా,

నేనీవిషయాల్లో కలిపించుకోవడంయేమీ బావుండదు నాన్నా!" అన్నాడు పరిహాసధోరణిలో.

సుబ్బారాయుడికి, తన తెలివి తక్కువతనం యిప్పుడు తెలిసివచ్చింది. నిజమే! ఆ కుర్రకుంకమీద తను ఆ బాధ్యత పెట్టడమేమిటి! అనుకుని మౌనం వహించాడు. కూనిరాగం తీసుకుంటూ రఘు తన గదిలోకి పోయాడు.

రెండు రోజులు గడిచాయి. సుబ్బారాయుడు కూతురి పెళ్ళి విషయం మళ్ళీ విస్మరించాడు. రోజూ ఆఫీసుకి వెళ్ళడం, సాయంత్రం చీట్లపేకలో కూచోవడం - యిలా గడిచింది.

మూడోరోజు స్నేహితులంతా చీట్లపేక ఆడుతున్నారు.

"ఏం నయ్యా సుబ్బారాయుడూ..." అంటూ ప్రారంభించాడు ముకుందరావు. "ఏమిటి విశేషం" మందహాసంతో చేతిలోవున్న ముక్కలు చూసుకుంటూ ప్రశ్నించాడు సుబ్బారాయుడు.

"అబ్బే! ఏమీలేదూ... మరేం అనుకోకుగాని, మీ అమ్మాయికి సంబంధాలు యేమీ రాలేదా యేమిటి?" అన్నాడు.

సుబ్బారాయుడికి గుండెలు ఝల్లుమన్నాయి. తను మళ్ళీ ఆ విషయం విస్మరించాడే అన్న పశ్చాత్తాపం కలిగింది. ముకుందరావుకి మరే యెంత మంది,యెన్ని విధాల తన పరోక్షంలో అనుకుంటున్నారో?... అన్న తర్కం వుద్భవించిందతనిలో.

"వస్తున్నయ్యోయ్... కాని... నాకు ఒక్కటీ నచ్చడంలేదు." ఏదో ఒకటి చెప్పాలి గనుక చెప్పేశాడు.

"ఇలా ఆలోచిస్తూ కూచుంటే? నువ్వు పెళ్ళి చేసినట్టే; ఏదో ఒహ సంబంధం స్థిరపర్చి, నీ బాధ్యత నువ్వు నెఱవేర్చుకోకూడదూ?! అటుమీదట హాయిగా నువ్వుకూడా 'రామాకృష్ణా' అని కూర్చోవచ్చును..." సలహాయిస్తూ అన్నాడు ముకుందరావు.

"అదే నేను కూడా అనుకొంటున్నానులే..." ముక్తసరిగా అనేశాడు సుబ్బారాయుడు.

తరువాత ఆ ప్రస్తావనకి ఫుల్ స్టాప్ పెట్టబడింది.

ఆరోజు పేకాట ఆడుతున్నాడే గాని సుబ్బారాయుడి మెదడు మాత్రం ముకుందరావు మాటలనే నెమరువేసుకొంటున్నది. ఆరాత్రి యింటికి వెళ్ళిన వెంటనే పెద్దకొడుక్కి వుత్తరం రాసేశాడు వెంటనే బైలుదేరి రమ్మని. కూతురి పెళ్ళి విషయంలో అతని ప్రయత్నానికి అదే నాంది.

ఆ రాత్రంతా సుబ్బారాయుడు ఆలోచనలతోనే గడిపాడని చెప్పాలి. నీరజకి యెక్కడ సంబంధం చూడ్డమా అని పరిపరి విధాల తలపోశాడు. ఎలాగైనా తను, నీరజకి వివాహం చేసెయ్యాలి. తన బాధ్యత నెఱవేర్చుకోవాలి ... అనుకున్నాడు.. అదే సమయంలో సరిగ్గా అతనికి చప్పున ఓ విషయం గుర్తుకొచ్చింది. ఆ మధ్య గోవిందరావు, మాటల సందర్భంలో, అతని కొడుక్కి నీరజనిచ్చి పెళ్ళి చెయ్యమన్నాడు. అప్పట్లో ఆ అబ్బాయికి వుద్యోగం లేకపోవడం తనూ అంతగా పట్టించుకోలేదు. చూద్దాంలే అనేసి వూరుకున్నాడు. ఇప్పుడా కుర్రాడికి వుద్యోగం అయ్యింది. గోవిందరావుని ఓసారి అడిగితేసరి! మంచిఆలోచన సమయానికి స్ఫురించినందుకు సంతోషించాడు. ఆతర్వాతనే ఆ రాత్రి అతనికి నిద్రపట్టింది కూడాను.

* * *

సుబ్బారాయుడి పెద్దకొడుకు విశ్వనాథం, అతని భార్య విమల వచ్చారు. సుబ్బారాయుడు కొడుకు కోడలికి, కూతురు పెళ్ళి విషయం చెప్పాడు. మామూలుగా.

"ఇందులో నాతో సంప్రదించవల్సిందేముంది నాన్నా? మీరున్నారుగా! మీరు యే సంబంధం నిశ్చయించినా, మాకు అభ్యంతరంలేదు. అయితే, కట్నాలు కానుకలు అధికంగా యిచ్చుకోలేమన్న విషయం గుర్తుంచుకుంటేచాలు.." అన్నాడు విశ్వనాథం.

"కట్నాలు అధికంగా యెరదూపించకపోతే, యీరోజుల్లో యేం సంబంధాలు వస్తున్నాయిరా? నీకు మాత్రం తెలియందేముంది? ఇంతెందుకు? నీ పెళ్ళికి మూడువేలు, కట్నరూపంలో తీసుకున్నట్టు గుర్తుందిగా!"

విశ్వనాథం మౌనం దాల్చాడు. కాని, అతని భార్య మాత్రం మౌనంగా వుండలేక పోయింది. మొహం పక్కకి తిప్పుకుని ఓసారి చిట్లించుకుందికూడాను.

"మా వాళ్ళకి డబ్బుంది కాబట్టి, వాళ్ళు యివ్వగలిగారు ఇప్పుడు మనం కూడా అంతలేని పరుగులు పోతామంటే యెట్లా?" సగర్వంగా అంది.

ఆమె మాటలు సుబ్బారాయుడికి కాస్తంత నొప్పి కలిగించాయి. అయినాసరే, కోడలితో కయ్యం తెచ్చుకోవడం, అతనికి యిష్టంలేక పోయింది. ఈ పరిస్థితుల్లో తను ఒంటరిగా కార్య

సాధన చెయ్యలేదు.. అందరి సహకారమూ అవసరం.

"అది నిజమేలే అమ్మాయ్... అయినా సరే తొత్తిగా యేదారిన పోయే దానయ్యకో యిచ్చి ముడి పెట్టలేం గా? కాస్త కుటుంబ సాంప్రదాయం, మంచీ చెడ్డా, చూసుకోవాలాయె." అని అంటుండగా అతనికి చప్పున గోవిందరావు కొడుకు విషయం స్ఫురణకు వచ్చింది." అన్నట్టు ఒరేయ్ అబ్బాయ్ గోవిందరావుగారి అబ్బాయి వున్నాడు. ఒకప్పుడు గోవిందరావే కావాలని మన అమ్మాయిని కోడలిగా చేసుకుంటానని అన్నాడు. అప్పట్లో ఆ అబ్బాయికి వుద్యోగం లేదు గాబట్టి, నేను చూద్దాంలే అనేశాను. ఇప్పుడా అబ్బాయికి వుద్యోగం దొరికింది కూడాను. కాని... ఒక్క విషయం.. కుర్రాడు అంత బా వుండడు.." అని ముగించాడు.

"రూపులో యేముందండీ మామగారూ! కుర్రవాడు బుద్ధిమంతుడై, తెలిసిన వాడయితే, యింక కావల్సిందేవిటి? నిశ్చయంచేస్తే సరి..." అంది మామగారితో చెప్తూ, ధర్మవేణి తిరిగి. ఏదో ఆ బాధ్యత నెత్తినుంచి తొలగించుకోవడమే ముందిదనిపించిందామెకి. "ఓ నాన్నా! దగ్గరగా వున్న సంబంధం.. ఇంకా ఆలోచించడమెందుకు: నిశ్చయం చేయండి.. తక్కువ ఖర్చుతో జరుగుతుందంతు..." అన్నాడు విశ్వనాథం.

సుబ్బారాయుడు చిన్నకొడుకు అభిప్రాయం అడిగాడు. రఘుకూడా అడ్డు చెప్పలేదు.

'అవుతే నిశ్చయించేస్తా' అంటూ నిర్ణయానికి వచ్చేశాడు సుబ్బారాయుడు. కూతురికి తనుయిక పెళ్ళి చేసేస్తానన్న ధైర్యం వచ్చేసిందతనికి.

ఎటొచ్చీ నీరజకి ఆ సంబంధం యిష్టం లేకపోయింది. గోవిందరావు కొడుకును ఓ సారి చూసింది కాబట్టి అతని రూపురేఖలు ఆమెలో ఆవేదనని పెంచాయి. అవుతే తన నిరసన యెవరితో చెప్పుకుంటుంది. తండ్రితో చెప్పుకొందుకు ధైర్యం చాలడంలేదు అన్నలతో చెప్పుకున్నా వారు వినిపించుకోరని ఆమెకి తెలుసు. ఎటొచ్చీ మిగిలిన వ్యక్తి విమల. స్త్రీగనుక తనపరిస్థితి తెలుసుకొని సానుభూతి చూపుతుందేమోనన్న వుద్దేశంతో వదినతో చెప్పుకుంది తనకీ వివాహము యిష్టంలేదని.

"ఎక్కడైనా వింటే నవ్వుతారు నీరజా! పెద్దవాళ్ళు నిశ్చయించిన సంబంధం సమ్మతంగా లేదని చెప్పడం వారిని అవమానించినట్లే అవుతుందికూడా. పూర్వాళ్ళు... తెలిసినవాళ్ళు... అబ్బాయి మంచివాడు... ఇంతకంటె యింకేం కావాలి? అందం కొరుక్కు తింటామా యేమిటి; మరింకేం పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకు" అంటూ మందలించింది విమల. నీరజకి యెల్లాంటి భర్త దొరికితే తనకేం? అన్న నిర్లక్ష్యభావం ఆమెకు వుంది కూడాను.

నీరజ స్తంభించిపోయింది; మౌనంగా బావురుమంది. ఇంక తను యేంచేస్తుంది? ఎవరితో చెప్పుకొంటుంది? ధైర్యంచేసి తండ్రితో చెప్తే?.. ఆయనే తన స్వంత అభిప్రాయంతో యీసంబంధం నిశ్చయించితే తను నిరసన తెల్పితే మాత్రం మానేస్తాడా. మరింత విసుగుపడడూ? అవుతే యిప్పుడు గత్యంతరమేమిటి? ఆ అనాకారిని వివాహంచేసుకొని తను జీవితమంతా వ్యథతో గడపవల్సిందేనా?

ఆరోజు రాత్రంతా నీరజ మెదడులో యిలాంటి ఆలోచనలు అంతులేని సంక్షోభంతో ఆమె గుండెలు కొట్టుకున్నాయి. ఈ విపరీత పరిస్థితి తట్టుకోలేక పోయింది ఆ లేతహృదయం....

మరునాటి రోజునుండి ఆమె మంచం పట్టేసింది. అంతే డాక్టరు వచ్చి మందులిచ్చారు. ..ఇంజక్షనిచ్చారు. లాభం లేకపోయింది. చిక్కి శల్యమై పోయింది. క్రమంగా ఆమె మనసులో వున్న భీతి యెవరికీ అర్థంకాదు. చివరికి ఓ నాడు ఓ నిట్టూర్పు విడిచి కళ్ళు మూసింది శాశ్వతంగా.